క్లుప్తంగా

మాదకద్రవ్యాలకు బానిస కావొద్దు



సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావును సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: యువత మాదక ద్రవ్యాలకు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు, శాశ్వత లోక్ అదాలత్ జడ్జి ఎం.వెంకట హరినాథ్ అన్నారు. సోమవారం నగర శివారులోని రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో యాంటీ ర్యాగింగ్, వినియోగదారుల హక్కులు, మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. యువత చేడు అలవాట్లకు బానిస అయితే, ఆ ప్రభావం దేశ భవిష్యత్తుపై పడుతుందన్నారు. అనంతరం న్యాయమూర్తులను సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు వి.జయలక్ష్మీదేవి, కాలేజీ స్పెషల్ ఆఫీసర్ డా.వై పాండురంగయ్య, ప్రిన్సిపాల్ డా.శ్రీనివాసమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డా.జె.ఉషశ్రీ, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

గూడూరు రూరల్ : మండల పరిధిలోని గుడిపాడులో మాజీ సర్పంచు రంగన్న, వైఎస్సార్ సీపీ నాయకుడు శివరాంరెడ్డి కుటుంబ సభ్యలను సోమవారం కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ పరామర్శించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ఇద్దరు నాయకులు అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే గ్రామానికి చేరుకొని ఇరువురి భౌతిక కాయాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాలను పరామర్శించి, అండగా ఉంటామని భరోసానిచ్చారు.

మణిపూర్ ఘటనపై ప్రజా సంఘాల నిరసన



తహసీల్దార్ జయన్నకు వినతి పత్రాన్ని అందిస్తున్న ప్రజా సంఘ నాయకులు

గూడూరు రూరల్: మణిపూర్‌లో జరిగిన మారణహోమానికి వ్యతిరేకంగా కోడుమూరు పట్టణంలో సోమవారం ప్రజా సంఘాల నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కోట్ల సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నల్ల బ్యాడ్జీలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఆంధ్రయ్య మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అల్లర్లను నిరోధించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో గఫూర్‌మియ్యా, నాగేష్, రాజు, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణగా దిశ యాప్

గడివేముల: రాష్ట్రంలోని మహిళలకు, విద్యార్థులకు అండగా నిలిచేందుకు దిశ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని గడివేముల సచివాలయం-2 మహిళ పోలీస్ షేక్ మల్లిక తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన గడివేములలోని రాజరాజేశ్వరి పాఠశాలలో విద్యార్థుల, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రఘు, వలంటీరు మద్దిలేటి పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారం

కర్నూలు (టౌన్) : స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ తెలిపారు. సోమవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. నగరానికి చెందిన పలువురు వివిధ సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు.

'శ్రీకృష్ణ కర్ణార్జునీయం'కు ఐదు హనుమ అవార్డులు

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం వారి 'శ్రీకృష్ణ కర్ణార్జునీయం' పద్య నాటకం ఐదు హనుమ అవార్డులు కైవసం చేసుకుంది. తిరుపతి మహతి ఆడిటోరియంలో ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు అభినయ ఆర్ట్స్ 23వ జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటక పోటీలు జరిగాయి. పోటీల్లో టీజీవీ కళాక్షేత్రం కళాకారులు 'శ్రీకృష్ణ కర్ణార్జునీయం' పద్య నాటకం ప్రదర్శించారు. ఈనెల 30వ తేదీన జరిగిన నాటక ప్రదర్శనల ముగింపు కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి విజేతల పేర్లు ప్రకటించి బహుమతులు అందజేశారు. శ్రీకృష్ణ కర్ణార్జునీయం తృతీయ ఉత్తమ నాటకంగా నిలిచి రూ.30 వేల పారితోషికం గెలుచుకుంది. దీంతో పాటు ఉత్తమ దర్శకత్వంలో పత్తి ఓబులయ్య, ఉత్తమ సహాయ నటుడిగా జీవీ శ్రీనివాసరెడ్డి, ఉత్తమ నటి సురభి వెంగమాంబ, ఉత్తమ రంగాలంకరణ సురభి సంతోష్ నిలిచి హనుమ అవార్డులు అందుకున్నారు. వీరికి టీజీవీ కళాక్షేత్రం సభ్యులు సోమవారం అభినందనలు తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి 'చేయూత'

- 45 నుంచి 60 ఏళ్ల పేద మహిళలకు వైఎస్సార్ చేయూత ద్వారా ఆర్థిక సాయం
- రూ.18,750 వ్యక్తిగత ఖాతాల్లో జమ
- మండలంలో 2600 మందికి రూ.48 కోట్ల లబ్ధి
- షాపులు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా రాణిస్తున్న మహిళలు



మంచాలకట్టలో ఉశేన్‌బీ ఏర్పాటు చేసుకున్న కిరాణ దుకాణం

గడివేముల: మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అత్యంత ప్రధాన్యమిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద, మధ్య తరగతి వర్గాల మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారు. ఏటా క్రమం తప్పకుండా వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 45 నుంచి 60 ఏళ్లు నిండిన పేద మహిళలకు ఒక్కొక్కరికి రూ.18,750 వ్యక్తిగత ఖాతాలలో జమచేస్తున్నారు. ఈ నగదును కొందరు కుటుంబ అవసరాలకు వినియోగిస్తుండగా, మరికొందరు చిన్నపాటి వ్యాపారులు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా రాణిస్తూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు.

చేయూతతో పాటు బ్యాంకు రుణాలు..

మండలంలోని 14 సచివాలయాల పరిధిలో గతేడాది 2,392 మందికి రూ.4,87,50,000 మంజూరయ్యాయి. ఈ ఏడాదికి సంబంధించిన అర్హులైన మహిళలను గుర్తించి వలంటీర్లు ఈకేవైసీ చేయించారు. వైఎస్సార్ చేయూతకు బ్యాంకు రుణాలు తీసుకుని మండలంలో ఇప్పటివరకు 46 మంది మహిళలు వివిధ దుకాలను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదుగుతున్నారని ఏపీఎం హజరత్ తెలిపారు. దుకాణానికి రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు.

గ్రామాల వారీగా లబ్ధిదారుల వివరాలు..

బిలకలగూడూరు 277, బూజునూరు 121, చిందుకూరు 158, దుర్వేశి 131, గడిగరేవులలో 192 మంది అర్హత సాధించారు. అదేవిధంగా గడివేముల-1 సచివాలయంలో 165, గడివేముల- 2 సచివాలయ పరిధిలో 165 మంది, గని 232, కొరటమద్ది 116 మంది అర్హులకు వైఎస్సార్ చేయూత పథకంలో భాగంగా నగదు జమ చేశారు. అలాగే కరిమద్దెల 197, కొర్రపాలూరు 106, మంచాలకట్ట 217, ఒండుట్ల 117, పెసరవాయి 198 మందికి రూ.18750 అకౌంట్లలో జమ చేశారు. ఈ ఏడాది ఇప్పటికే కొత్తగా అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

పేదల పాలిట దైవం

పేదల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల పాలిట దైవంగా సీఎం జగనన్న మారారు. ప్రభుత్వం అందించిన వైఎస్సార్ చేయూత నగదుతో పాటు బ్యాంకు రుణం ఇప్పించడంతో కిరాణం దుకాణం పెట్టుకున్నాను. మా కుటుంబం ఆర్థికంగా బాగా ఉంది. సీఎం జగన్‌కు రుణపడి ఉంటా.
–ఉశేన్‌బీ, కిరాణ దుకాణం, మంచాలకట్ట గ్రామం

చిల్లర దుకాణం పెట్టుకున్నాను



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన వైఎస్సార్ చేయూత సాయం రూ.18,750తో పాటు బ్యాంకు రుణం రూ.56,250 పొదుపు ఏపీఎం ఇప్పించారు. ఈ డబ్బుతో మా గ్రామంలో దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నాను. ప్రతిరోజు దుకాణం నుంచి వచ్చే ఆదాయంతో మా కుటుంబం జీవనం సాగిస్తున్నాం. కుటుంబంలో అందరం ఆనందంగా ఉన్నాం.
–చాంద్‌బీ, చిల్లర దుకాణం, గడివేముల గ్రామం

పేదలకు అండగా నిలిచాడు



కోవిడ్ కారణంగా పనులు లేక ఇబ్బందులు పడుతున్నప్పుడు ముఖ్యమంత్రి జగనన్న వైఎస్సార్ చేయూతను అందించి మాకుటుంబానికి ఎంతో మేలు చేశాడు. చేయూత నగదుతో పాటు అధికారులు బ్యాంకు రుణాలు ఇప్పించడంతో కిరాణ దుకాణం పెట్టుకున్నాను. రోజుకు రూ.600 వరకు ఆదాయం వస్తుంది. కూలీ పనులకు పోకుండా ఇంటి వద్దనే కూలీ డబ్బులు సంపాదించుకుంటున్నాను. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.
–షేక్ అజ్‌మత్‌బీ–కిరాణం దుకాణం, తిరుపాడు గ్రామం

దుష్ప్రభావాలను తగ్గించేందుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ డా.జీ సృజన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

కర్నూలు(అర్బన్): వాతావరణ మార్పుల వల్ల జరిగే దుష్ప్రభావాలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.జి. సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో వాతావరణ మార్పు వల్ల మానవ ఆరోగ్యంపై కలిగే ప్రభావానికి సంబంధించి జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్సు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ... వాతావరణ మార్పు వల్ల మానవ ఆరోగ్యం ప్రభావితమై అనేక వ్యాధులు ప్రబలుతున్నాయని, దీంతో పాటు కరువు, వరదలు వంటి ప్రకృతి విపత్తులతో ఓజోన్, వాయు కాలుష్యం, రేడియేషన్ వంటి దుష్ప్రభావాలు తలెత్తుతున్నాయని యునైటెడ్ నేషన్స్ రిపోర్టు ఇచ్చిందన్నారు. వీటి నివారణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమం అమలుకు జిల్లా స్థాయి టాస్క్ ఫోర్సు కమిటీని ఏర్పాటు చేశామన్నారు. కమిటీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమం, వ్యవసాయ సహకార శాఖ, పశు సంవర్ధకశాఖ, వాతావరణ శాఖ, విద్యా శాఖ తదితర శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.రామగిడ్డయ్య, ప్రోగ్రాం ఆఫీసర్ డా.హేమలత తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం'



మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు(న్యూటౌన్): ఆగస్టు 2 నుంచి 31వ తేదీ వరకు కోడుమూరు నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ తెలిపారు. సోమవారం రాత్రి ఆయన తన నివాసంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2 నుంచి 22 వరకు కోడుమూరు మండలంలో, 8 నుంచి 26వ తేదీ వరకు కర్నూలు మండలంలో, 12 నుంచి 31వ తేదీ వరకు సి.బెళగల్ మండలంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుంటానన్నారు.

'8 నుంచి మీ సచివాలయం – మీ ఎమ్మెల్యే'

ఆగస్టు 8 నుంచి 31వ తేదీ వరకు కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు మండలాల్లోని సచివాలయాల పరిధిలో మీ సచివాలయం - మీ ఎమ్మెల్యే కార్యక్రమం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే సుధాకర్ తెలిపారు. లబ్ధిదారుల సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయా గ్రామాల్లోని వలంటీర్లు తమ పరిధిలోని లబ్ధిదారుల సమస్యలపై అధికారులతో కలిసి విన్నవిస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సమస్యల పరిష్కారానికే మీ సచివాలయం - మీ ఎమ్మెల్యే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో కోడుమూరు, కర్నూలు రూరల్ తహసీల్దార్లు జయరాముడు, శివరాముడు, కోడుమూరు, గూడూరు, కర్నూలు, సి.బెళగల్ ఎంపీడీఓలు చంద్రశేఖర్, మాధవీలత, అజాం ఖాన్, రాముడు పాల్గొన్నారు.

మణిపూర్ మారణకాండను ఖండించాలి

కర్నూలు(న్యూటౌన్): మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండను ప్రతిఒక్కరూ ఖండించాలని సీపీఎం మండల కార్యదర్శి హుసేనయ్య కోరారు. సోమవారం రాత్రి కర్నూలు మండలం ఇ.తాండ్రపాడు, గొందిపర్ల గ్రామాల్లో మణిపూర్ ఘటనలను వ్యతిరేకిస్తూ క్యాండిల్ లైటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో 90 రోజుల నుంచి ఘర్షణలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదన్నారు. కార్యక్రమంలో ఇ.తాండ్రపాడు సర్పంచు బాలపీర, నాయకులు అంజనేయులు, గోపాల్, శ్రీరాములు, బాబు, తిరుమలేష్, రేణుక, నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిరసన చేపట్టిన ఇ.తాండ్రపాడు, గొందిపర్ల గ్రామస్తులు

విద్యుత్ తీగల దొంగ అరెస్టు



తీగల దొంగను అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ రాజారెడ్డి

ఓర్వకల్లు: రెండేళ్లుగా విద్యుత్ తీగల చోరీలకు పాల్పడుతున్న దొంగను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కోడుమూరు మండలం ముడుమలగుర్తి గ్రామానికి చెందిన కోట్ల నాగేంద్ర కరోనాకు ముందు విద్యుత్ శాఖ అధికారుల వద్ద కారు డ్రైవర్‌గా చేరాడు. ఆ సమయంలో విద్యుత్ స్తంభాలను ఎక్కుతూ, దిగుతూ అధికారులకు సాయపడేవారు. అయితే కరోనా వచ్చినప్పటి నుంచి అధికారులు అతడిని వృత్తిలోకి రానివ్వలేదు. ఈ క్రమంలో గత అనుభవంతో విద్యుత్ తీగల చోరీని ఉపాధిగా మార్చుకున్నాడు. ఈ నెల 29వ తేదీన మండలంలోని పూడిచెర్ల వద్ద రాత్రి 11 గంటల సమయంలో గ్లోబల్ హిల్స్ అనే ప్రైవేట్ వెంచరులో విద్యుత్ స్తంభాలకు అమర్చిన సిల్వర్ తీగ (జంపర్ వైర్లు)లను తన వెంట తెచ్చుకున్న కట్టర్‌తో కట్ చేసి అనుమానం రాకుండా పక్కనే ఉన్న కంప చెట్ల మధ్య దాచిపెట్టాడు. సోమవారం తీగలను ఆటోలో తరలిస్తుండగా పోలీసులకు సమాచారం అందడంతో నాగేంద్రను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు నేరం అంగీకరించడంతో కేసు నమోదు చేసి, అతని వద్ద నుంచి సుమారు రూ.30 వేల విలువ చేసే వంద మీటర్ల సిల్వర్ తీగను, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

'స్పందన' సమస్యలను పరిష్కరించండి

సి.బెళగల్: ప్రజల అర్జీల రూపంలో ఇచ్చిన సమస్యలను మండల, గ్రామ స్థాయి అధికారులు వెంటనే పరిష్కారం అయ్యేలా చూడాలని తహసీల్దార్ శేషఫణి అన్నారు. సోమవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు, మండల అధికారులతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మండల, గ్రామ స్థాయి అధికారులతో పెండింగ్ సమస్యలు, స్పందన అర్జీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈఓఆర్డీ సందీప్, ఏఓ మల్లేష్ కుమార్, ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాషా తదితరులు పాల్గొన్నారు. కాగా కార్యక్రమానికి వైద్య, విద్యుత్, పశు వైద్య, పోలీస్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ అధికారులు గైర్హాజరు అయ్యారు. వీరిపై చర్యలకు ఆయా శాఖల జిల్లా అధికారులకు సిఫార్సు చేస్తామని తహసీల్దార్ శేషఫణి తెలిపారు.

గూడూరు రూరల్: స్పందనలో వచ్చే సమస్యలపై దృష్టి సారించి పరిష్కారం చూపాలని ఉద్యోగులకు తహసీల్దార్ శివశంకర్‌నాయక్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కల్లూరు: మండల పరిధిలోని యాపర్లపాడు గ్రామంలో మంగళవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గ్రామంలో ఇంటింటికి తిరిగి సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు. మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు మంజూరు

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ పరిధిలోని ఎస్సీ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.14.64 కోట్లు విడుదల చేస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ సంచాలకులు కోటేశ్వరరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో ఎస్సీ కాలనీల్లో రోడ్లు, మురుగు కాల్వలు, రహదారుల విస్తరణ, గ్రీనరీ, పార్కులు తదితర అభివృద్ధి పనులు చేపడతారు.

స్పాట్ బిల్లింగ్ ప్రారంభించండి

కర్నూలు(రాజ్‌విహార్): నెలవారి విద్యుత్ బిల్లుల జారీ ప్రక్రియ స్పాట్ బిల్లింగ్‌ను మంగళవారం నుంచి ప్రారంభించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి ఆదేశించారు. సోమవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 1 తేదీ నుంచి తప్పనిసరిగా స్పాట్ బిల్లింగ్ చేపట్టి, వినియోగదారులకు డిమాండ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఇల్లు, షాపు వద్ద ఉన్న మీటర్ వద్దకు వెళ్లి డిజిటల్ స్కాన్ చేసి బిల్లింగ్ తీయాలన్నారు. మీటర్లు స్కానింగ్ కానిపక్షంలో పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ రామయ్య

- వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు రామయ్య, కాటసాని
- 19వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కల్లూరు: దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, రాజకీయ, పార్టీలకు, వర్గాలకు అతీతంగా అర్హులైన వారందరికీ ఇంటి ముంగిటకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కర్నూలు, నంద్యాల జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 19వ వార్డులోని నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మేయర్ కాలనీలో విస్తృతంగా పర్యటిస్తూ ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల వల్ల వారు పొందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు.

అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం

మేయర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం వేశారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం వెల్లివిరుస్తుందన్నారు. ప్రజలందరికీ మంచి చేశాం కాబట్టే ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లుతున్నామని చెప్పారు. రాబోయ్యే ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టంకట్టాలని కోరారు.

జగన్ పాలనకు జనం జేజేలు

ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి రహితంగా ప్రజా జనరంజాక పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోమన్‌రెడ్డికి జనం జేజేలు పలుకుతున్నారన్నారు. రాష్ట్రంలోని పేదలందరి మోములలో చిరునవ్వులతో సంతోషంగా సంక్షేమ పథకాలతో వారు పొందిన లబ్ధిని వివరిస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీల ద్వారా పెత్తందారీతనంతో వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు అరుణ, శ్వేతారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, విక్రమసింహారెడ్డి, డీఈఈ రవిప్రకాష్ నాయుడు, స్థానిక వార్డు నాయకులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు



ఇనగండ్లలో నాడు నేడు పనులను పరిశీలిస్తున్న పీఆర్ డీఈ మహేశ్వరరెడ్డి

సి.బెళగల్: మనబడి నాడు – నేడు రెండో విడతలో భాగంగా పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని కర్నూలు పంచాయతీరాజ్ డీఈ మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన మండల పరిధిలోని ఇనగండ్ల గ్రామంలో పర్యటించి ప్రభుత్వ భవన నిర్మాణాలను, మనబడి నాడు- నేడు పనులను పరిశీలించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు- నేడు పనుల్లో లోపాలను గుర్తించి అధికారులపై మండిపడ్డారు. అనంతరం నాణ్యత లోపించిన పనులను కూలీలతో తొలగింపు చేపట్టారు. మరోసారి నాసిరక పనులు చేపడితే రికవరీ చేస్తామని హెచ్చరించారు. సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్ నిఖిల్, మాధురి, గ్రామస్తులు ఉన్నారు.

ఉద్యాన పంటలపై దృష్టి సారించాలి



పోలకల్‌లో కొబ్బరి చెట్లను పరిశీలిస్తున్న ఏపీడీ అల్లిపీర

సి.బెళగల్: మండల రైతాంగం ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని డ్వామా ఏపీడీ అల్లిపీర సూచించారు. సోమవారం ఆయన మండలంలోని పోలకల్, సి.బెళగల్ గ్రామాలలో పర్యటించి ఉద్యాన పంట సాగులో భాగంగా రైతులు నాటుకున్న కొబ్బరి, జామ పండ్ల తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల సాగులో మెలకువలు, పథకం ద్వారా అందే సహాయ సహకారాలను తెలియజేశారు. పండ్లు, పూల తోటల పెంపకాలకు ముందుకు వచ్చే రైతులుకు వంద శాతం సబ్సిడీపై మొక్కలను అందజేయడంతో పాటు నిర్వహణ ఖర్చులను సైతం ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లిస్తుందన్నారు. అనంతరం పోలకల్ గ్రామ సచివాలయం – 3ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఈసీ పృథ్వీరాజ్ ఉన్నారు.

ఆలయంలో అన్నదానం

గూడూరు రూరల్ : పట్టణంలోని శ్రీ నీలకంఠేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి నెల చివరి సోమవారం దాతల సహకారంతో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా రాత్రి 7 నుంచి 9 గంటల వరకు దేవాలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేయడం జరిగిందని భక్త బృందం తెలిపారు.

ప్రజారోగ్యానికి ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

- వర్ష కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు
- రోడ్లు, కాల్వలు శుభ్రంగా ఉంచేందుకు ప్రణాళికతో పనులు



పాణ్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

పాణ్యం : వర్షాకాలం నేపథ్యంలో పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య చర్యలకు మరింత పదును పెట్టారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సమీక్షలు నిర్వహిస్తూ పంచాయతీ సిబ్బందికి పలుసూచనలిస్తున్నారు.

శుభ్రతకు ప్రాధాన్యత

మండలంలో మొత్తం 19 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలోని గ్రామాల్లో అధికారులు శుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన వీధులను మరింత శుభ్రం చేయిస్తున్నారు. కాల్వల్లో డ్రైనేజీ సమస్యలు రాకుండా పూడికలను తొలగించి నీరు నిల్వవుండకుండా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే వర్షాకాలంలో ఎక్కడా మంచినీటి పైపులైన్లు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ట్యాంక్‌లు, బోర్లు, వాటి అవరణ, పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా కాలువల్లో, నీరు నిల్వవున్న చోట వేస్ట్ ఆయిల్ చల్లి, దోమల నివారణ మందును పిచికారీ చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఫాగింగ్ చేయిస్తున్నారు. అధికంగా బురద ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లుతూ అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రతి రోజు సమీక్ష



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం. వర్షా కాలంలో ప్రజలకు సురక్షిత మంచినీటితో పాటు, గ్రామా ల్లోని వీధులు శుభ్రంగా ఉండేలా చూస్తున్నాం. ప్రతిరోజూ సమీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూస్తాం. – ఈఓఆర్డీ భాస్కర్‌రావు

పొలంబడితో రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న కన్సల్టెంట్ లక్ష్మయ్య

కర్నూలు(న్యూటౌన్): పొలంబడి కార్యక్రమంతో వ్యవసాయంలోని మెలకువలపై రైతులకు అవగాహన కల్పించాలని కన్సల్టెంట్ లక్ష్మయ్య ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సూచించారు. సోమవారం దిన్నెదేవరపాడు గ్రామంలో పొలంబడి కార్యక్రమానికి హాజరై పత్తి పంటను పరిశీలించారు. పత్తి పైరును ఆశించే పురుగు, తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహారంతో ప్రజలు ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాచురల్ ఫార్మింగ్ అసోసియేట్ బిజేశ్వరుడు, మాస్టర్ ట్రైనర్ మల్లికార్జున పాల్గొన్నారు.